ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తే చర్యలు

విశాలాంధ్ర -పాయకరావుపేట: తాండవనది వంతెన ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తూ, నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు కలుగ జేస్తున్న వారిపై పాయకరావుపేట పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి, మండల పరిషత్ సూపరిండెంటు సీహెచ్‌ఆర్‌కె వర్మ చర్యలు చేపట్టారు. ఈసందర్భంగా వర్మ మాట్లాడుతూ వంతెన ఫుట్‌పాత్‌లపై చేపలు, పండ్ల అమ్మకాలు జరగడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఫుట్‌పాత్‌లపై అమ్మకాలు నిషేదించామన్నారు. వ్యాపారాలు చేసే వారికి రూ.500 అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మాజీ సర్పంచ్ పందిరి అప్పారావు మృతి

శోక సంద్రంలో పాత కృష్ణాదేవి పేట

విశాలాంధ్ర -గొలుగొండ: అభివృద్ధి స్ఫూర్తి ప్రదాత పేద ప్రజల ఆపద్బాంధవుడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మాజీ సర్పంచ్ పందిరి అప్పారావు అనారోగ్యంతో మృతి చెందారు. గొలుగొండ మండలం పాత కృష్ణా దేవి పేట గ్రామానికి చెందిన పందిరి అప్పారావు 1979 నుండి ఏకధాటిగా 15 సంవత్సరాల పాటు సర్పంచ్ గా పనిచేశారు. అదేవిధంగా మరో మారు ఒకే ఒక్క ఓటుతో గెలిచి చరిత్ర సృష్టించారు ఇలా నాలుగు సార్లు సర్పంచ్ గా పనిచేసి గ్రామాన్ని అన్ని విధాలాగా అభివృద్ధి పథంలో నడిపించిన మహోన్నతమైన వ్యక్తి అని పలువురు కొనియాడారు. తండ్రి చూపిన బాటలోనే ప్రస్తుతం పాత కృష్ణా దేవి పేట సర్పంచ్ గా తన పెద్ద కుమారుడు పందిరి సత్యనారాయణ పనిచేస్తున్నారు. పందిరి అప్పారావు మృతి చెందిన వార్త దావనంలా వ్యాపించడంతో కొయ్యూరు గొలుగొండ మండలాల్లో ప్రజానీకం ఆయనను కడసారి చూసేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అదేవిధంగా వివిధ పార్టీలకు చెందిన పలువురు కడసారి చూసి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పందిరి అప్పారావు మృతితో పాత కృష్ణా దేవి పేట లో విషాదఛాయలు అలుముకున్నాయి.

నావల్ డాక్ యార్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక సంఘం అధ్యక్షుడిగా దాసుబాబు

విశాలాంధ్ర -సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామం, నావల్ డాక్ యార్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో గౌరవ అధ్యక్షులు రొంగలి కృష్ణారావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా మంగళవారం జరిగింది . నావెల్ డాక్ యార్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం. దాసుబాబు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యాక్షులుగా జి. అచ్చుతరావు, కె. ప్రసాదు, ప్రదాన కార్యదర్శి గా కె. రవి , సహాయ ప్రధాన కార్యదర్శిగా ఆర్. వి .రమణ, కోశాధికారిగా జి. దేముడు, సహాయ కోశాధికారిగా ఎస్. హరీష్, మరియు కార్యవర్గ సభ్యులుగా ఎస్. ఎర్నినాయుడు, పి. శ్రీరాములు, పి. ఈశ్వరరావు, పి. అచ్చయ్యనాయుడు, జి .చిన రాము, ఆర్. గణపతి, జి. పరదేశి ,అలాగే ముఖ్య సలహా దారుడుగా నోర్నిపూడి సత్యం ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే సుందరపు

విశాలంధ్ర-అచ్యుతాపురం : విజయవాడలో శ్రీశ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారిని యలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మంగళవారం దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ వారు ఆహ్వానించి అర్చకులుచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన మండలపార్టీ అధ్యక్షుడు బైలపూడి శ్రీరామదాసు తదితరులు ఉన్నారు .

ప్రశంసాపత్రం అందుకున్న లోవరాజు

విశాలాంధ్ర -అచ్యుతాపురం: గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా ఉత్తమ సేవలందించిన లోవరాజు ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు . మండల తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న లోవరాజు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు . ఈ సందర్భంగా పలువురు లోవరాజును అభినందించారు .

కూటమి ప్రభుత్వంపై చేస్తున్నవి నిందారోపణలు

ఖండించిన చోడవరం జనసేన పార్టీ ఇంచార్జి రాజు

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట/చోడవరం: కూటమి నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తున్న గుడివాడ అమర్నాథ్ , కరణం ధర్మశ్రీ ల వైఖరిని చోడవరం జనసేన పార్టీ ఇంచార్జి పివిఎస్ఎన్ రాజు తీవ్రంగా తప్పు పెట్టారు. మంగళవారం మీడియా సమావేశంలో అయన మాట్లాడుతూ నిన్న జరిగిన ఒక మీడియా సమావేశంలో చోడవరం వైసీపీ సమయకర్త గుడివాడ అమర్నాథ్, కరణం ధర్మశ్రీ లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో చోడవరం చక్కర కర్మాగారానికి నష్టం జరుగుతుందని, అలాగే పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ మైనింగ్ దందాకి పాల్పడుతున్నారని అసత్యపు ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇదే అమర్నాథ్ గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పుడు అనకాపల్లి నియోజకవర్గంలో చేసిన అవినీతిదందాలు అందరికీ తెలు సని, సాక్షాత్తు పరిశ్రమల శాఖ మంత్రిగా ఉండి ఆయన నియోజకవర్గంలో ఉన్న తుమ్మపాల చక్కర కర్మాగారాన్ని గాలికి వదిలేశారని , సదరు ఫ్యాక్టరీ భూములను వైస్సార్సీపీ నాయకులు ఆక్రమించుకొంటే వారికి వత్తాసు పలికారని, అలాగే ఏటి కొప్పాక, తాండవ చక్కెర కంపెనీలు కూడా ఎటువంటి సహకారం అందించలేదని, ఐదు సంవత్సరాలు అధికారం అనుభవించి ఈరోజు తగుదునమ్మా అని కొత్తగా వచ్చి చోడవరం చక్కరగారాన్ని తానేదో రక్షించే నాయకుడుగా మాట్లాడడం విడ్డురంగా ఉందన్నారు. లక్షలకోట్ల రూపాయలు పరిశ్రమల్ని తీసుకొచ్చే క్రమంలో పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ అనునిత్యం ఢిల్లీ స్థాయిలో పనిచేసి గౌరవ ప్రధానమంత్రి కూడా తీసుకువచ్చి శంకుస్థాపనలు చేస్తుంటే కళ్ళున్న కబోదులా వాటిని గుర్తించకుండా ఆయన మైనింగ్ ద్వారా అక్రమార్జన చేస్తున్నారని ఆయనపై తప్పుడు అవినీతి ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చేతనైతే మంచి సలహాలు ఇవ్వడం ద్వారా అభివృద్ధి పనులుకు సహకరించాలని అంతేగాని ఇటువంటి చౌకబారు ఆరోపణలు చేయడాన్ని సహించమని, గత ప్రభుత్వ కాలంలో పూర్తిగా ధ్వంసం అయిపోయిన నర్సీపట్నం చోడవరం రహదారిని పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ గారు స్థానిక శాసనసభ్యుల సహకారంతో పునర్నిర్మాణం చేయడం ప్రారంభమైందని అన్నారు. చోడవరం చక్కర కర్మాగారాన్ని ఇథనాల్ ప్లాంట్ గా మార్చే ప్రక్రియ ప్రారంభం అయిందని, రైతుల ప్రయోజనాలకొరకు కూటమి నాయకులు అండగా ఉంటామన్నారు. మరోమారు భవిష్యత్తులో ఇటువంటి అసత్య ఆరోపణలు చేస్తే గట్టిగా స్పందించాల్సి ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చోడవరం నియోజకవర్గానికి సంబంధించిన నాలుగు మండలాలు అధ్యక్షులు టౌన్ అధ్యక్షులు వీర మహిళ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి పెద్ద చెరువును పరిశీలించిన ఇరిగేషన్ శాఖ అధికారులు!

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట: ఇటీవల జరిగిన సాగునీటి ఎన్నికలలో మండలంలోని పెద్దపూడి పెద్ద ట్యాంక్ సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ఉండా తాతారావు అభ్యర్థన మేరకు మరియు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు సూచన మేరకు పెద్ద చెరువుకు వెళ్లి చెరువు లో సంవత్సరాల తరబడి పేరుకుపోయిన పలు సమస్యలను పరిశీలించి చేపట్టవలసిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా చెరువులో నీరు నిల్వ ఉండే విధంగా చెరువును అభివృద్ధి పరిచి చెరువు కింద ఉన్న ప్రతి ఆయకట్టుదారుని పొలానికి నీరు చేరే విధంగా సిమెంట్ కాలువలు ఏర్పాటు గురించి మరియు పూడుకుపోయిన మధుములు స్థానంలో నూతనంగా మధుములు ఏర్పాటు చేయాలని నీటి సంఘం అధ్యక్షులు తాతారావు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఎఈ సత్యనారాయణ దొర, వర్క్ ఇన్స్పెక్టర్ శివ మరియు గ్రామ కూటమి నాయకులు గోకివాడ మహేష్, కురుందాసు అప్పారావు పాల్గొన్నారు.

పీ.హెచ్.సి అభివృద్ధి కమిటీ సమావేశం

విశాలాంధ్ర -సబ్బవరం: మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశము మంగళవారం నిర్వహించినట్లు హాస్పిటల్ ప్రధాన వైద్యాధికారి ఎస్.ఎన్ .ఆర్.చక్రవర్తి తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ బోకం సూర్యకుమారి ఆధ్వర్యంలో జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ సూర్యకుమారి హాస్పిటల్ అభివృద్ధి కోసం పలు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు తెలిపారు.అలాగే స్టాఫ్ వేకెన్సీ గురించి తీర్మానం చెయ్యడం జరిగిందన్నారు. ఈ సమావేశమునకు ఎంపీడీవో పి.పద్మజ, గౌరవ సభ్యులు బోకం రామునాయుడు, సబ్బవరం గ్రామ సర్పంచ్ డి.ప్రసాదరావు, మాజీ జడ్పిటిసి కోటన రాము ,, అంతకాపల్లి గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంవిధాన్ గౌరవ్ దివస్

విశాలంధ్ర-అచ్యుతాపురం: మండలంలో భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో యలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి రాజాన సన్యాసినాయుడు ఆధ్వర్యంలో మంగళవారం సంవిధాన్ గౌరవ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా జనరల్ సెక్రటరీ పట్టాభి ప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని మోడీ ప్రభుత్వం పంచతీర్థలను అభివృద్ధిని చేసిందని , రాహుల్ గాంధీ తెల్ల టీషర్టు వేసుకొని నిరసన వ్యక్తం చేయడం హాస్యాస్పదమన్నారు . బిజెపి మండలపార్టీ అధ్యక్షుడు కూండ్రపు నాయుడుబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కిషన్ మోర్చా జిల్లా అధ్యక్షులు జేవిఎస్ రాజు , రాష్ట్ర సైనిక్ సెల్ కోకన్వీనర్ అగ్గాల హనుమంతరావు , మత్స్యకార నాయకులు ఓరుపుల జయశంకర్ , మామిడి సురేష్ , శిరా చిరంజీవి , రాజన పార్థు , కర్రి వెంకటస్వామినాయుడు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు .

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

విశాలాంధ్ర -సబ్బవరం: మండలంలోని స్థానిక బిజెపి కార్యాలయంలో సోమవారం సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమం 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు గోంప నర్సింగరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ధనలక్ష్మి విచ్చేశారు. అంబేద్కర్ చిత్రపటానికి ఆమె పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 140 కోట్లు భారతీయులకు ఆరాధ్యుడని రాజ్యాంగం అనేది హిందువులు భగవద్గీత, ముస్లింలకు ఖురాన్ ,క్రైస్తవులకు బైబిల్ లాంటి పవిత్ర గ్రంథం అని కొనియాడారు. అలాగే సబ్బవరం మండలం లో 32,61,55,56,36,37 బూత్ లలో కార్యక్రమాలు మండల బిజెపి పార్టీ శ్రేణులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పడాల వెంకటరమణ సీనియర్ నాయకులు వనం సత్యనారాయణ , పి. అప్పారావు,ఎం.ప్రభుకుమార్ ,ఎం.చిక్రవర్తి ,బి.సోమునాయుడు ,ఎస్.. సత్యనారాయణ ,వి.నాగరాజు , ఎస్. శ్రీనివాస్ , అర్.రామునాయుడు జి. సత్యప్రసాద్, జి. సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర -సబ్బవరం: సబ్బవరం మండలంలోని సబ్బవరం-01 సెక్షన్ పరిధిలో 33/11 కేవీ సబ్బవరం సబ్ స్టేషన్ లో న్యూ బ్యాకర్స్ కన్స్ట్రక్షన్ వర్క్ కారణంగా 33కేవీ సబ్బవరం ఫీడర్ ఎల్ సి ఇవ్వడం జరుగుతుంది కావున ఈనెల 29వ తేదీ బుదవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ఫీడర్లు పరిధిలోని గ్రామాలు సబ్బవరం, తవ్వవనిపాలెం, అమృతాపురం, గొల్లలపాలెం, పైడివాడ, ఆసకపల్లి, ఇరువాడ పంచాయతీ పరిధిలోని వినియోగదారులకు విద్యుత్ అంతరాయం కలుగుతుంది. కావున ఆయా గ్రామాల ఏపిఈపిడిసిల్ విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించవలసిందిగా కోరారు.

వీరభద్రపేటలో ఉచితపశువైద్య శిబిరం

విశాలాంధ్ర-చీడికాద: మండలంలోని వీరభద్రపేట గ్రామంలో ఖండివరం పశువైద్యాధికారి గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు ఈకార్యక్రమన్ని సర్పంచ్ వంటాకు నరసింహమూర్తి ప్రారంభించారు ఈసందర్భంగా గణేస్ మాట్లాడుతూ పాడి రైతులు తమ పశువులకు ప్రభుత్వం నుంచి వచ్చే టీకాలు వినియోగించుకోవాలన్నారు ప్రతినెల పశువులకు నట్టల నివారణ మందులు వేయాలన్నారు పలు ప్రభుత్వ పథకాలను ఆయన రైతులకు వివరించారు ఈ కార్యక్రమంలో శిరంరెడ్డి సన్యాసినాయుడు రెడ్డి సత్యనా రాయణ సబ్బవరపు ఎరుకు నాయుడుపల్లి రాజుబాబు ,బండారు వరహాలుమూర్తి పాతరవల్లి సంతోష్ కుమార్ పశుసంవర్ధక సహాయకులు గుడివాడ రమేష్ మోర్తా శ్రీనివాసరావు చుక్కా రమేష్ పాడి రైతులు పాల్గొన్నారు.

శెట్టి బలిజ కులస్తులకు మద్యం షాపు కేటాయింపు

ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సిఐ వి రామకృష్ణ

విశాలాంధ్ర-గొలుగొండ: గొలుగొండ, నాతవరం ఎక్సైజ్ అండ్ సర్కిల్ పరిధిలో శెట్టి బలిజ కులస్తులకు రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపు కేటాయించడం జరిగిందని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వి రామకృష్ణ తెలిపారు. మంగళవారం విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో సిఐ రామకృష్ణ మాట్లాడుతూ గొలుగొండ, నాతవరం మండలాల్లో ఉన్న శెట్టి బలిజ కులస్తులు కు రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపును ప్రభుత్వం కేటాయించిందని దీనికి ఫిబ్రవరి 5వ తేది సాయంత్రం లోగా అన్ లైన్ లో లేదా గొలుగొండ ఎక్సేజ్ అండ్ ప్రోహిబిసన్ సర్కిల్ కార్యాలయంలో కానీ దరఖాస్తులు అందజేయాలని తెలియజేశారు ముఖ్యంగా దరఖాస్తు దారుడు అనకాపల్లి జిల్లాకు చెందిన శెట్టిబలిజ కులస్తులై ఉండాలన్నారు దరఖాస్తు చేసేటప్పుడు కుల ధృవపత్రం నివాసధ్రువపత్రం తప్పనిసరిగా జత చేయాలని ఆయన సూచించారు.

ఉల్లాస్ పథకంపై వాలంటీర్లకు శిక్షణ

విశాలాంధ్ర-రోలుగుంట: మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో ఎంపీడీవో వి.ఎస్ నాగేశ్వరరావు, ఏపీఎం కె.ఉషారాణి, ఎఓ ఎస్.లక్ష్మీ ఆధ్వర్యంలో మంగళవారం ఉల్లాస్ శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వాలంటీర్లకు ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలను వీరికి అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 15 నుంచి 50 సంవత్సరాల వయసు గల నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వాలంటీర్ టీచర్లు తమ పరిధిలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్వాడీ సెంటర్లలో వయో జనులకు విద్యాభ్యాసం చేయాలన్నారు. దీనికి ఏ విధమైన పారితోషకం ఉండదని పూర్తి ఉచితంగానే వయో జనులకు విద్య నేర్పాలని సూచించారు. ఇందుకు గాను వాలంటీర్ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు కనకమహాలక్ష్మి, గంగాభవాని, సరోజినీ, మణిరాజు, ఎఫ్పిటీసీసీ సత్యవతి, అకౌంటెంట్ ప్రవల్లిక పాల్గొన్నారు.

మార్చి నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలి

జడ్పీ సీఈఓ నారాయణమూర్తి

విశాలాంధ్ర-పాయకరావుపేట: మండలానికి మంజూరైన నిధులతో చేసే పనులు మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని జడ్పీ సీఈఓ నారాయణమూర్తి పాయకరావుపేట ఎంపిడిఓ జయప్రకాశరావును ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని అకస్మికంగా సందర్శించిన ఆయన కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. మండలంలో చేస్తున్న పనులు, పురోగతి గూర్చి అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పట్టణంలోని అరటికాయల మార్కెట్‌లో ఉన్న సీతారాంపురం, నక్కపల్లికి తాగునీటిని సరఫరా చేసే వాటర్ స్కీమ్‌ని పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఈ వై.ఆనంద్‌కుమార్, సూపరిండెంటు సీహెచ్‌ఆర్‌కె వర్మ, ఏఈ ఫణివర్మ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే జీవితంలో విజయాలు

విశాలాంధ్ర-పాయకరావుపేట: కష్టపడి చదివితే జీవితంలో విజయాలు సాధించవచ్చని బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ మాటూరి సరోజిని అన్నారు. మండలంలోని గుంటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ చిన్న వయస్సులోనే విద్యార్థులు మంచి లక్ష్యాలను ఎంచుకోవాలన్నారు. కష్టపడి చదివి పుట్టిన గ్రామానికి, తల్లిదండ్రులకు, చదువు నేర్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈసందర్భంగా ఆమెను ఉపాధ్యాయులు సన్మానించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం రామారావు, ఉపాధ్యాయులు వెంకన్న, శ్రీనివాసరావు, నాగూర్, సుధాకర్, రవిబాబు, శ్యాం, రాజు తదితరులు పాల్గొన్నారు.

గుంటపల్లిలో పశు ఆరోగ్య శిబిరం

విశాలాంధ్ర-పాయకరావుపేట: మండలంలోని గుంటపల్లి గ్రామంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 34పశువులకు గర్భకోశ చికిత్సలు, 26 పెయ్యలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గెద్దం కన్నబాబు, పల్యాల లక్ష్మణరావు, పశు వైద్యాధికారి కెవిజెఆర్ గుప్త, సిబ్బంది హర్ష, హరికృష్ణ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

రూపేష్ ని హాకీ సంఘం నుండి శాశ్వతంగా తొలగించిన జిల్లా హాకీ సంఘం

విశాలాంధ్ర-యలమంచిలి: యలమంచిలి హాకీ క్రీడా చరిత్రకు మచ్చ తెచ్చిన సంఘటనకు కారణమైన హాకీ క్రీడాకారుడు మల్ల రూపేష్ ని హాకీ సంఘం నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నా మని జిల్లా హాకీ సంఘ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర హాకీ సంఘం ఆదేశాల మేరకు లైంగిక ఆరోపణలలో అరెస్టు కాబడిన మల్ల రూపేష్ పట్ల హాకీ సంఘం ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. అదేవిధంగా సాటి క్రీడాకారునిపై లైంగిక వేధింపులకు పాల్పడడం దారుణమని అటువంటి చర్యలను హాకీ సంఘం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి దుశ్చర్య లకు పాల్పడేలా ప్రవర్తన కనిపించిన ఏ క్రీడాకారులైన హాకీ నుండి బహిష్కరిస్తామని అన్నారు. అదేవిధంగా బాధిత క్రీడాకారిణికి హాకీ సంఘం అన్ని విధాల అండగా నిలుస్తుందని తెలిపారు. అనకాపల్లి హాకీ సంఘం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి హాకీ క్రీడాకారుడు మల్ల రూపేసిని సంఘం నుంచి తొలగిస్తున్నట్టు నిర్ణయించడం జరిగిందని జిల్లా ఉపాధ్యక్షులు రాంబాబు, కార్యదర్శి నరేశ్, రాజా తెలిపారు.

ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-మాకవరపాలెం: టైలరింగ్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ(నాక్) ఏడి రవికుమార్ సోమవారం తెలిపారు. మండల కేంద్రంలోని నాక్ శిక్షణా కేంద్రంలో రెండు నెలలపాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఏడవతరగతి ఆపై చదువుకున్న మహిళలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలుకు 7780275922 నంబర్ ను సంప్రదించాలన్నారు

కేపీ అగ్రహారం లో తాగునీటి బోరు కు శంకుస్థాపన చేసిన సర్పంచ్ గోపిశెట్టి

విశాలాంధ్ర-బుచ్చియ్యపేట : మండలం లో కేపీ అగ్రహారంలో గ్రామ సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాస్ త్రాగునీటి బోరు నిర్మాణ పనులుకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఉమ్మడి విశాఖ జిల్లా జడ్పిటిసిల ఫోరం అధ్యక్షులు జడ్పిటిసి సభ్యులు దొండా రాంబాబు సిఫారసు మేరకు రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి ఎంపీ గ్రాంట్స్ నుండి నిధులు మంజూరు చేశారని తెలిపారు.దేవర వారి కల్లాల వద్ద ఇటు రైతులకు అటు పశువులకు ఉపయోగపడేలా త్రాగునీటి బోరు ఏర్పాటు చేశారు.మాజీ మాజీ ఎంపీపీ ఎంవీ సత్యనారాయణ, ఉపసర్పంచ్ దేవర ముసలి నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా వల్లభేశ్వర స్వామి తీర్థం

విశాలాంధ్ర-యస్. రాయవరం : మండలంలో సముద్ర తీర ప్రాంతం బంగారమ్మ పాలెం గ్రామంలో వల్లభేశ్వర స్వామి తీర్థం ఘనంగా జరిగింది. మంగళవారం గ్రామంలో స్వామివారి తీర్థం సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు వచ్చి దర్శించుకున్నారు. అదేవిధంగా భారీ తీర్థం కావడంతో ప్రజలు వచ్చి వస్తువులు కొనుగోలు తో పాటు తీర్థాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాధవ్, మాజీ సర్పంచ్ కారే కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మాడుగులలో పశు ఆరోగ్య శిబిరం

విశాలాంధ్ర-వి.మాడుగుల: మాడుగులలో కర్రి వారి పొలాల వద్ద మంగళవారం జిల్లా స్పెషల్ ఆఫీసర్, వెటర్నరీ కౌన్సిల్ ఈశ్వరరావు, పాడేరు డివిజన్ ఉపసంచాలకులు జి.నరసింహారావు, మాడుగుల ఏరియా ఆసుపత్రి ఉపసంచాలకులు వి.చిట్టినాయుడు ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఈ నెల 20 తేదీ నుండి 31వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసిందని వారు తెలిపారు. సుమారు 70 పశువులకు, 30 పెయ్యిలకు నట్టల నివారణ మందును అందించారు. ప్రభుత్వం అందించిన మినరల్ మిక్చర్ ప్యాకెట్లను రైతులకు అందించారు. అనంతరం పశువులకు సంబంధించి వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యద్ధ కళావతి , పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-యలమంచిలి : 33/11 కెవి పురుషోత్తపురం సబ్ స్టేషన్ మెయింటనెన్సు పనులు నిమిత్తం బుధవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు పురుషోత్తపురం, పోతురెడ్డిపాలెం, రుక్మిణిపురం, రేగుపాలెం, వెంకునాయుడుపాలెం, పులపర్తి, పిఎస్ఆర్ పేట, బయ్యవరం, విశాఖ డెయిరీ, విశాఖ బయో మెరైన్ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని అన్నారు. అవకాశం ఉన్న చోట ఉదయం 4 గంటల నుండి ఉదయం 9 గంటల వరకు, మధ్యాహ్నం 1 గంటల సాయంత్రం 5 గంటల వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ లకు విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందని విద్యుత్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని కోరారు.